ప్రజాశక్తి
సోమవారం 18 మార్చి 2024
5
విజయనగరం

బాక్సింగ్‌లో సచిన్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నంలో జరిగిన మూడో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల బాక్సింగ్ పోటీల్లో విజయనగరానికి చెందిన బి.సచిన్ బంగారు పతకం సాధించాడు. ఈ నెల 18 నుంచి 25 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో జరిగే జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. సచిన్‌ను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఎస్ఇ రాజు, పిఎల్ ప్రసాద్ , బాక్సింగ్ రింగ్ అఫీషియల్స్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు, బి.జగదీష్ నాయుడు అభినందించారు.

సచిన్

తగ్గారా..? తగ్గించారా..?

ఎమ్‌పి, ఎమ్మెల్యే టిక్కెట్లకు నోచని చిన్న శ్రీను

ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్‌పిగా పోటీచేయాలని ఎంతో ఆశగా, ఆతృతగా ఎదురు చూసిన జిల్లా పరిషత్తు చైర్మన్, వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కల నెరవేరలేదు. చివరి క్షణాల్లో శ్రీనే వెనక్కి తగ్గి పోయారా? లేక పార్టీనే వెనక్కి తగ్గించిందా? ఇదీ ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న చర్చ. ఆయన అనుయాయులు, అభిమానులు మాత్రం పార్టీ అధిష్టానం వైఖరిని జీర్ణించుకోలేకపోతున్నారు. తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒకనాడు మంత్రి బొత్స సత్యనారాయణ... నేడు అదే స్థాయిలో చిన్న శ్రీను అన్నట్టుగా గడిచిన దశాబ్ద కాలంలో వైసిపిని ఒంటిచేత్తో నడిపించారు. బొత్స జోక్యం ఉన్నా లేకపోయినా ఓవైపు నాయకత్వాన్ని సమన్వయం చేస్తూ, మరోవైపు పార్టీని ముందుకు నడిపిస్తూ ప్రత్యేక స్థానాన్ని, గుర్తింపును ఏర్పాటు చేసుకున్నారు. అందుకు తగ్గట్టే గత ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని స్థానాలు వైసిపికి వచ్చాయి. నాటి విజయంలో చిన్న శ్రీను పాత్ర తక్కువేం కాదు. ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పార్టీ కార్యక్రమాల్లో సైతం చిన్న శ్రీనుకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలోనే 2024లో అసెంబ్లీ లేదా పార్లమెంట్‌కు వెళ్లాలనే ఆశ అడుగడుగునా కనిపించేది. ఈసారి ఎలాగైనా చిన్న శ్రీను ఎమ్‌పి లేదా ఎమ్మెల్యేగా పోటీచేస్తారనే చాలా మంది రాజకీయాలకు అతీతమైన వ్యక్తులు సైతం భావించారు. అనుకున్నట్టే రెండు నెలల క్రితానికి బొబ్బిలి లేదా ఎచ్చెర్ల నుంచి రంగంలో దింపుతారనే ప్రచారం గట్టిగానే నడిచింది. అందుకు సామాజిక సమీకరణాలు అనుకూలించకపోవడంతో విజయనగరం ఎమ్‌పిగా పోటీకి దిగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషణలు వచ్చాయి. ఒకానొక దశలో విశాఖపట్నం ఎమ్‌పిగా బొత్స ఝాన్సీలక్ష్మిని ప్రకటించినప్పుడే విజయనగరం ఎమ్‌పి టికెట్ చిన్న శ్రీనుకు ఖాయమైందని కూడా చర్చ నడిచింది. సిట్టింగ్ ఎమ్‌పి బెల్లానకు ప్రత్యామ్నాయం చూపుతారని కూడా ప్రచారం జరిగింది. కానీ, శనివారం ప్రకటించిన జాబితాలో చిన్న శ్రీను పేరు కనిపించలేదు.

చిన్న శ్రీనుకు టికెట్ లేకుండా చేయడం కోసం మంత్రి బొత్స తన రాజకీయ పలుకుబడితో సిట్టింగులను యథాతథంగా కొనసాగించేందుకు అధిష్టానాన్ని ఒప్పించారని ప్రచారం ముమ్మరంగా నడుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో శ్రీనుకు ఎమ్‌పి లేదా ఎమ్మెల్యే టికెట్ ఇస్తే, ప్రస్తుతం ఉన్న జిల్లా పరిషత్తు చైర్మన్ పదవికి ఎన్నికలకు ముందుగానే రాజీనామా చేయించాలనే మెలిక కూడా పెట్టారట. జిల్లా అడ్మినిస్ట్రేషన్, రాజకీయాలను శాసించేందుకు అనువుగా ఉన్న జెడ్‌పి పీఠాన్ని వదులుకునేందుకు ఇష్టం లేక చిన్న శ్రీనే వెనక్కి తగ్గారని చర్చ నడుస్తోంది. పార్టీ జిల్లా సమన్వయకర్తగా ప్రస్తుత ఎన్నికల్లో అత్యంత కీలకంగా పనిచేయాల్సింది శ్రీనే. కాబట్టి, పార్టీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్ పదవి ఇచ్చి పార్టీ సంతృప్తి పర్చిందని పలువురు విశ్లేషిస్తున్నారు. పోటీకి అధిష్టానం అవకాశం ఇవ్వకపోవడం, అందుకు జిల్లాకు చెందిన నేత అడ్డపడ్డారన్న ఊహాగానాల నేపథ్యంలో ఎన్నికల్లో శ్రీను పాత్ర ఎలా ఉంటుందో అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

129 కేంద్రాల్లో నిర్వహణ ● హాజరు కానున్న 23,828 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 18 నుంచి 30 తేదీ జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 422 పాఠశాలల నుంచి 23,828 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 129 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావాలి. అరగంట పాటు అవకాశం ఇస్తారు. ఇదే పనిగా రోజు ఒకే విద్యార్థి ఆలస్యంగా వస్తే తర్వాత వారికి పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. కొన్ని కారణాల రీత్యా ఆలస్యంగా వస్తే 10 గంటల వరకు అనుమతించేందుకు అవకాశం ఉంటుంది.

ఇప్పటికే విద్యుత్, వైద్య, రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారంతో పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. విద్యార్థుల హాల్ టికెట్ మీద హెచ్ఎం సంతకం తప్పనిసరిగా ఉండాలి. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదు. పరీక్ష నిర్వహణకు 1400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితోపాటు తనిఖీ బృందాలు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా సమయానికి ఆర్‌టిసి బస్సులు అందుబాటులో ఉంచుతున్నారు. హాల్ టికెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు సుబ్బారావు, డిఇఒ ప్రేమ్‌కుమార్

పరీక్ష నిర్వహణకు సర్వం సిద్ధం

సోమవారం నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాసుకునేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలి. సమయానికి హాజరు కావాలి.

- ఎన్.ప్రేమ్‌కుమార్, డిఇఒ

జన జాతర

ఎల్లారమ్మ, కనకమహాలక్ష్మమ్మ జాతరలకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి - జామి

జామిలో ఎల్లారమ్మ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్రపాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు జాతరకు తరలివచ్చారు. దీంతో ఈ ఏడాది జాతరకు లక్షలాది మంది జనం పోటెత్తారు. అదివారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి జనం ముడుపులు చెల్లించారు. గ్రామదేవతల పండుగలకు భిన్నంగా ఎల్లారమ్మ జాతర నిర్వహిస్తారు. జంతు బలులు లేకుండా సంప్రదాయ పద్ధతిలో ముడుపులు చెల్లించడం ఇక్కడి ప్రత్యేకత. జాతర నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో కిలో మీటరు పొడవున బొమ్మల కొలువులు, రంగుల రాట్నం, సర్కస్ వంటి అనేక పిల్లల్ని ఆకర్షించే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నేపథ్యంలో జాతర రెండు రోజులు రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. సందర్శకులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు. జామి పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జాతరలో భాగంగా సోమవారం కొత్తలివారి కోవెల వద్ద చిన్నతీర్థం జరగనుంది.

అట్టహాసంగా ఆరంభం

చీపురుపల్లి : చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి, పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్య ప్రకాశరావు, ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, మాజీ సర్పంచ్ మీసాల సరోజిని, సర్పంచ్ మంగళగిరి సుధారాణి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి ఘటాలు, ప్రభలతో నృత్య, గీత, సంగీత, మంగళ వాయిద్యాల మధ్య చీపురుపల్లి పుర వీధుల్లో శోభాయాత్రను ఆలయం వరకు నిర్వహించారు.

చీపురుపల్లి.. కనకమహాలక్ష్మమ్మ ఆలయం వద్ద యాత్రికుల రద్దీ

ఎమ్‌పి బెల్లానకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కంట్రోల్ రూమ్ ప్రారంభం

ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు ● ప్రజా ఫిర్యాదుల కోసం 'సి విజిల్' యాప్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల ప్రకటన విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ అమలుపై ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ఆదివారం ప్రారంభమైంది. కంట్రోల్ రూమ్‌కు సిపిఒ బాలాజీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. దీనికి అన్ని విభాగాలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా, సోషల్ మీడియా సెల్, 24/7 కాల్‌సెంటర్, కంప్లైంటింగ్ మానిటరింగ్ సెల్, రిపోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం విభాగాలు పని చేస్తున్నాయి.

పబ్లిక్ యాప్ సి విజిల్

మోడల్ కోడ్ ఉల్లంఘనపై మెయిల్స్‌లో, సోషల్ మీడియాలో, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపించనున్నారు. ఈ ఎన్నికలలో ఫిర్యాదుల కోసం ప్రజా యాప్ సి విజిల్ ద్వారా కూడా స్వీకరిస్తున్నారు. ఈ యాప్ కోసం ఆండ్రాయిడ్ ఫోన్‌లో కెమెరా ఆప్షన్ ఉండాలి. ఫొటోలు, ఆడియో, వీడియోలను, మోడల్ కోడ్ ఉల్లంఘన లైవ్ రిపోర్టింగ్‌ను ఈ యాప్ ద్వారా పంపవచ్చు. ముందుగా రికార్డ్ చేసిన ఫొటోలు, వీడియోలు ఈ యాప్‌లో అనుమతించబడవు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో క్షేత్ర స్థాయిలో విచారించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుదారు వారి పేరు, ఫోన్ నంబర్ రాసినా, రాయకున్నా ఫిర్యాదును స్వీకరించి చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుల కోసం 24/7 పని చేసే 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చు.

కంట్రోల్ రూమ్‌లో ల్యాండ్ లైన్ నంబర్లు

కంట్రోల్ రూమ్ ల్యాండ్ లైన్ 08922-797120, 08922-797124 నంబర్లకు ఫోన్ చేసి మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయడంతోపాటు ఎన్నికల సమాచారాన్ని పొందవచ్చు.

కంట్రోల్ రూమ్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నివేదికలు త్వరగా పంపాలి

ఎన్నికల కంట్రోల్ రూం నుంచి పంపించాల్సిన నివేదికలను ఎప్పటికప్పుడు వేగంగా పంపాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా, సోషల్ మీడియా సెల్, 24/7 కాల్ సెంటర్, కంప్లైంటింగ్ మానిటరింగ్ సెల్, రిపోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం విభాగాలు ఎలా పని చేస్తున్నాయని వివరాలు అడిగారు. సోమవారం నుండి పూర్తి సిబ్బందితో పనిచేయాలని సూచించారు. అందుకు తగ్గ కంప్యూటర్లు, టివిలు, ఇతర అవసరాలన్నింటిని ఆదివారం సాయంత్రానికే సిద్ధం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు జెసి కార్తీక్, డిఆర్ఒ అనిత, సిపిఒ బాలాజీ, జిల్లా పరిషత్ సిఇఒ రాజ్ కుమార్, డిపిఒ శ్రీధర్ రాజా, డిపిఆర్ఒ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా పూర్తయింది. ఈ పరీక్షకు 61.46 శాతం హాజరు నమోదైంది. ఈ ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో మొత్తం 6,568 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికోసం జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం జరిగిన పరీక్షకు 4,069 మంది, మధ్యాహ్నం పరీక్షకు 4,037 మంది మాత్రమే హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఎపిపిఎస్‌సి అధికారులు పర్యవేక్షించారు.

భద్రత ఏర్పాట్లు పరిశీలన

విజయనగరం కోట : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా కేంద్రమైన సీతం ఇంజినీరింగ్ కళాశాలను ఎస్‌పి దీపిక ఆదివారం సందర్శించారు. భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా చర్యలను డిఎస్‌పి ఆర్.గోవిందరావు, రెండో పట్టణ సిఐ కె.రామారావు.. ఎస్‌పికి వివరించారు. నగరంలో గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను ఎఎస్‌పి అస్మా ఫర్హీన్ పర్యవేక్షించారు. ఎంఆర్ పిజి, ఫార్మసీ కళాశాలలు, ఎజిఎల్, ఆర్‌కె, గాయత్రి, ఎస్‌ఎస్‌ఎస్ కళాశాలలను సందర్శించారు. భద్రతా విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పరీక్షా కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

ఫ్లెక్సీని తొలగిస్తున్న కార్మికుడు

ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నగరంలో అన్ని రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలను కార్పొరేషన్ సిబ్బంది తొలగిస్తున్నారు. శనివారం రాత్రి నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నగరంలో ఎన్నికల అధికారి అనుమతి లేనిదే ఎటువంటి రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని చెప్పారు. నగరంలో ఉన్న విగ్రహాలకు ముసుగు కప్పి ఉంచనున్నట్లు తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విజయనగరం టౌన్ : మదర్ థెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, మదర్ థెరిసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా అయ్యన్నపేట జంక్షన్‌లో ఉన్న ఆ పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. కిడ్స్ స్కూల్ ప్రిన్సిపల్ త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాద్, మదర్ థెరిసా సేవా సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సంఘ సభ్యులు నూతన్, శ్రావణి, ఝాన్సీ, అరుణ, రెడ్‌క్రాస్ పిఆర్ఒ ఎం.రాము పాల్గొన్నారు.

ప్రజా సేవకే జనతా గ్యారేజ్

విజయనగరం టౌన్ : నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు జనతా గ్యారేజ్ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభిస్తున్నట్లు ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ముద్దాడ మధు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో అన్ని రాజకీయ పార్టీలు యాదవుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. త్వరలోనే బిసిల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ విషయంపై చర్చిస్తామని తెలిపారు.

హేమాహేమీలకు టికెట్లు కరువు

- అయోమయంలో కళావెంకటరావు భవిష్యత్తు
- కుమార్తె కోసం పక్కకు తప్పకోవాల్సిన స్థితిలో అశోక్
- వృద్ధాప్యంతో రాజకీయాలకు దూరమైన పతివాడ

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిలో అనూహ్య మార్పులు కనిపిస్తున్నాయి. కాకలు తీరిన రాజకీయ నాయకులు ఎన్నికల్లో పోటీకి దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజు కోసం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఏకంగా పోటీ నుంచే వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావు ఈ ఎన్నికల్లో సీటు కోసం ఉత్కంఠగా ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు వృద్ధాప్యంతో ఏకంగా రాజకీయాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా కాకలు తీరిన రాజకీయ నాయకులను 2024 సార్వత్రిక ఎన్నికలు రాజకీయాల నుంచి దూరం చేస్తున్నాయా? అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది.

అశోక్

పతివాడ

కళావెంకటరావు

సుజయ్‌కృష్ణ

లలితకుమారి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అశోక్ గజపతి రాజు.. టిడిపి ఆవిర్భావం నుంచీ ఆ పార్టీలో అత్యంత కీలకంగా ఉన్నారు. రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులతోపాటు పార్టీలో కీలక స్థానంలో కొనసాగుతున్నారు. కానీ, అశోక్ కుమార్తె అదితి గజపతిరాజుకు విజయనగరం ఎమ్మెల్యే సీటు అడగడం, అందుకు పార్టీ ముందుకు రావడంతో ఆయన అంతటితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కొద్ది రోజుల క్రితం వరకు ఎమ్‌పిగా అశోక్‌ను పంపొచ్చన్న ఊహాగానాలు వ్యక్తమైనా, ఇటీవల కుదిరిన పొత్తులో భాగంగా విజయనగరం లోక్‌సభ స్థానాన్ని బిజెపికి కేటాయించడంతో ఆ ద్వారం దాదాపు మూసేసినట్టే. ఈ నేపథ్యంలో ఈసారి అశోక్ పోటీకి దూరంగానే ఉండాల్సిన పరిస్థితి అనివార్యమైంది.

● నెల్లిమర్లలో టిడిపి కురువృద్ధునిగా ఉన్న పతివాడ నారాయణస్వామి నాయుడును వృద్ధాప్యం వల్ల ఈ సారి పోటీ నుంచి తప్పించారు. దీనికితోడు ఈ స్థానం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. ఈ నియోజకవర్గంలో ఎదురులేని నేతగా ఉన్న నారాయణస్వామి నాయుడు వారసులు కూడా ఆయన స్థాయిలో కనిపించడం లేదు.

● జిల్లాల పునర్విభజనలో భాగంగా మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు ప్రస్తుతం మన జిల్లా రాజకీయాలతో ముడిపడి ఉన్నారు. ఆయన నివాసం ఉంటున్న రాజాం నియోజకవర్గం ఎస్‌సి రిజర్వు కావడంతో మునుపటి మాదిరిగానే శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుంచి పోటీచేసేందుకు తహతహలాడుతున్నారు. ఆయనకు అక్కడ కొంత వ్యతిరేకత ఉండడంతో టికెట్ కేటాయింపు విషయంలో పార్టీ అధిష్టానం పునరాలోచనలో పడింది. శ్రీకాకుళం జిల్లాలో చాలా వరకు సీట్లు కేటాయించినప్పటికీ ఎచ్చెర్ల గురించి తేల్చకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వాస్తవానికి వెంకటరావు టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా కూడా పనిచేశారు. అయినా టికెట్ ఇవ్వడానికి పార్టీ ఇంతలా ఆలోచిస్తుండడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎచ్చెర్ల నుంచి వెంకటరావుకు ప్రత్యామ్నాయంగా కలిశెట్టి అప్పలనాయుడు పేరు పరిశీలనలో ఉన్నట్టుగా సమాచారం.

● బొబ్బిలిలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆయన సోదరుడు బేబినాయనకు బొబ్బిలి ఎమ్మెల్యే సీటు కేటాయించడంతో సుజయ్‌కృష్ణ రాజకీయ భవిష్యత్తుకు తాత్కాలికంగా బ్రేకు పడినట్టేనని పలువురు విశ్లేషిస్తున్నారు.

● కొన్ని దశాబ్దాలుగా శృంగవరపుకోట నుంచి టిడిపి అభ్యర్థి అంటే కోళ్ల... కోళ్ల అంటే టిడిపి అభ్యర్థి అన్నట్టుగా ఉండే పరిస్థితి. దీనిని తాజా రాజకీయ సమీకరణాలు తలకిందులు చేసే విధంగా కనిపిస్తున్నాయి. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు కోడలు లలితకుమారి కూడా సీటు కోసం చివరి వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి రాజకీయ నాయకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ స్థానం నుంచి పోటీలో దింపేందుకు యువ నాయకుడు గొంప కృష్ణ (ఎన్ఆర్ఐ) పేరును పరిశీలిస్తుండడమే ఇందుకు కారణమని సమాచారం.

ఇలా ఇప్పటికే అశోక్, పతివాడ నారాయణస్వామి నాయుడు, సుజయ్‌కృష్ణ రాజకీయ భవిష్యత్తు తాత్కాలికంగా బ్రేకు పడగా, కళావెంకటరావు, లలితకుమారి భవితవ్యం అయోమయ పరిస్థితికి దారితీసింది.

రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

రాములు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యా రంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో దొకల రాములు మాస్టర్ సేవలు మరువలేనివని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి, ఏపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.జోగినాయుడు అన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం రాములు మాస్టర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేశారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. మున్సిపల్ పాఠశాలలో పని చేసి, విజిత స్కూల్ ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది అమరాపు రామకృష్ణ, రిటైర్డ్ టీచర్ జి.చంద్రినాయుడు, ఏపిటిఎఫ్ నాయకులు, కుటుంబ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి, వైసిపి నాయకులు

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం..

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని కొండ్రారాజుపేట, బంగార్రాజుపేట, అక్కివరం, గొల్లగాం పంచాయతీలలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు, యువనేత బడ్డుకొండ ప్రదీప్ నాయుడు బూత్ కమిటీల సభ్యులకు ఆదివారం సిద్ధం కిట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు చేరువయ్యే విధానాన్ని మరొక్కసారి ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసు, మండల జెసిఎస్ కన్వీనర్ సారిక గౌరి, వైస్ ఎంపిపి తమ్మినాయుడు సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అండగా పోలీసులు

ప్రజాశక్తి - రామభద్రపురం

సార్వత్రిక ఎన్నికల వేళ ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలీసులు అండగా ఉంటారని తెలియజేసేందుకు పోలీసు కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు. ఆదివారం కేంద్ర పోలీసు దళాలతో మేజర్ పంచాయతీ రామభద్రపురం వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు ఆటంకం రాకుండా అసాంఘిక శక్తుల అరాచకాలు సాగకుండా శక్తివంతంగా పోలీసు వ్యవస్థ పనిచేసి ఎన్నికలు విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు

టిడిపిలో ఎం. కొత్తవలస సర్పంచ్ చేరిక

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని మరువాడ కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దాసరి శంకరరావు, శ్రీను, బంగారునాయుడు, ఉప సర్పంచ్ అప్పారావు, వార్డు మెంబర్లతో కలిసి 150 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి టిడిపి,జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపిపి కొండపల్లి కొండబాబు స్వగృహం వద్ద ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఫలించిన యుటిఎఫ్ పోరాటం

పలువురు సిఆర్‌టిలకు రెగ్యులరైజేషన్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

యుటిఎఫ్ దశాబ్దాల కాలంగా చేసిన అనేక పోరాటాల ఫలితంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు కాంట్రాక్టు ఉపాధ్యాయులకు (సిఆర్‌టి) రెగ్యులరైజ్ అయ్యింది. 2014 నుంచి నేటి వరకూ రూ.5,500 చాలీచాలని జీతాలతో సిఆర్‌టిలు విధులు నిర్వహిస్తూ వచ్చారు. వీరికి గౌరవ వేతనం, రెగ్యులరైజేషన్ కోసం యుటిఎఫ్ ఆధ్వర్యాన అర్ధనగ్న ప్రదర్శనలు, మోకాల నిరసనలు, పికిటింగులు వంటి ఎన్నో పోరాటాలు చేయడం జరిగింది. ఈ పోరాటాల ఫలితంగా అంచలంచెలుగా రూ.5,500 నుంచి రూ.7500, అక్కడ నుంచి 2014లో వారి జీవితం రూ.12000, అలాగే 2016లో కనీస పనికి కనీస వేతనం అనగా ప్రస్తుత పిఆర్‌సిలో రూ.44,570 సాధించడం జరిగింది. అలాగే వారి ప్రధాన డిమాండ్ అయిన రెగ్యులరైజేషన్ నేటికి నెరవేరింది. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా కార్యవర్గానికి సిఆర్‌టిలు అభినందనలు తెలిపారు. అయితే కొంతమంది సిఆర్‌టిలనే రెగ్యులరైజ్ చేయడం సమంజసం కాదని, మిగిలిన వారందర్నీ రెగ్యులర్ చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఐదోసారి రాజన్నదొరకు సీటు

ప్రజాశక్తి - సాలూరు

మాజీ మంత్రి రాజన్నదొరకు ఐదోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు ఖరారు కావడంతో నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆనందంతో బాణసంచా పేల్చారు. వైసిపి జిల్లా కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆదివారం బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. రానున్న ఎన్నికల్లో రాజన్నదొరను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు. నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే విజయపథంలో నడిపిస్తాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, వైసిపి నాయకులు గిరి చిన్ని, మేకల శంకరరావు, హరి బాలాజీ, లింగాల సింహాచలం పాల్గొన్నారు.

వామపక్ష అభ్యర్థులను గెలిపించండి

ప్రజావక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న సాధారణ ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే, అరుకు పార్లమెంట్ ఎంపి స్థానాలకు వామపక్షాల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం నాయకులు గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని మూల బిన్నిడి, చాపరాయి బిన్నిడి, గొరడ, వనకాబడి, దుడ్డు ఖల్లు గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి పాలనతో గిరిజనుల హక్కులు, చట్టాలకు పూర్తిగా రక్షణ కరువైందని తెలిపారు. జిఒ 3ను ఎత్తివేశారని తెలిపారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి కరువైందన్నారు. ఐటిడిఎ, జిసిసి సంస్థల్లో గిరిజనులకు సేవలందడం లేదన్నారు. పండించే పంటలకు కనీస మద్దతు ధరలకు పోయిందన్నారు. గిరిజనుల పక్షాన ఉండి నిరంతరం పోరాడుతున్న సిపిఎం, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలన్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక పూల్‌బాగ్ జంక్షన్ వద్ద ఆర్‌టిసి బస్సు ఢీకొని మహిళ కొల్లి పార్వతి (56) మృతి చెందింది. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ వివరాలు మేరకు గొల్ల వీధికి చెందిన కె.పార్వతి సొంత పని కోసం పూల్ బాగ్ వచ్చింది. పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా పూల్ బాగ్ జంక్షన్‌లో నారాయణపురం నుంచి బొబ్బిలి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందింది. పార్వతి మృతదేహాన్ని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన సందర్శించి ప్రమాదానికి గల కారణాలను ఎస్ఐ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని బేబినాయన కోరారు. మృతురాలి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు.

కోడ్ పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

సాధారణ ఎన్నికల సందర్భంగా అమలులోకి వచ్చిన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పక్కాగా అమలయ్యేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని తహశీల్దార్ సులోచన, ఎంపిడిఒ ఈశ్వరమ్మ వేర్వేరుగా తమ కార్యాలయాల్లో ఆదివారం నిర్వహించిన సమావేశాల్లో సిబ్బందికి ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు మండల వ్యాప్తంగా ఎన్నికల కోడ్ పై అవగాహన కల్పించాలని రాజకీయనాయకుల ఫోటోలతో కూడిన ప్రచార హోర్డింగులు ఫ్లెక్సీలు తొలగించాలని, దివంగత నేతల విగ్రహాలపై ముసుగులు వేసి ఉంచాలని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రూ.50 వేలకు పైబడిన నగదుతో ప్రయాణాలు చేయరాదని అలా అధిక నగదు కలిగి ఉంటే రసీదులు, ఆధారాలు చూపించాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను సద్వినియోగం చేసుకొని అన్ని వివరాలూ ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, బిఎల్ఒలు పాల్గొన్నారు.

విగ్రహానికి ముసుగు వేస్తున్న ఉద్యోగి

వేపాడ: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులంతా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఇఒపిఆర్‌డి ఉమా తెలిపారు. ఫ్లెక్సీలు తొలగించనట్లు ఫిర్యాదులు వస్తే ఎన్నికల అధికారి నిబంధనల మేరకు సంబంధిత కార్యదర్శి పై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మండలంలో ఆదివారం ఎంపిడిఒ నిచ్చల ఎన్నికల ప్రక్రియలో భాగంగా వేపాడ, సోంపురం గ్రామ సచివాలయాలను పరిశీలించారు. అనంతరం ఎన్నికల కోడ్‌పై పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి మజ్జి గౌరీ, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి రాంబాబు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని ఎంసిసి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఛైర్మన్, ఎంపిడిఒ జి.రామారావు సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పై ఏ ఆర్‌ఒ డి. ధర్మరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పార్టీల ప్రచారం ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా చేయరాదని, పార్టీల జెండాలు, వాల్ పోస్టర్లు ఉండరాదని సూచించారు. ఇళ్ళ మీద పార్టీల జెండాలు ఉంటే యజమాని అనుమతి తప్పనసరిగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎంసిసి చైర్మన్ రామారావు

నియమావళి పాటించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సాధారణ ఎన్నికల కోడ్ ప్రకటించడం జరిగిందని, ఎన్నికల నియమావళి విధిగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్నారు. జిల్లా కలెక్టర్లతో ప్రధాన ఎన్నికల అధికారి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు తదితర ప్రచార సామగ్రి తక్షణం తొలగించాలని ఆదేశించారు. సి విజిల్ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి అమల్లో లక్ష్యం చేయరాదని ఆయన అన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు పక్కాగా తయారు చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు -పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, ఎ.వెంకట రమణ, ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్, ఇన్‌ఛార్జ్ డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, ఎస్‌డిసి ఆర్ సూర్యనారాయణ, నోడల్ అధికారులు - జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా ఉద్యాన అధికారి కెఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి, లక్ష్మంపురం, రేగిడి, అంబాడ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైందని ఎంఇఒ ఎం.వర ప్రసాద్ రావు తెలిపారు. ఇప్పటికే అన్ని పరీక్షా కేంద్రాలకు మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. సంకిలి పరీక్ష కేంద్రంలో 112మంది, రేగిడి కేంద్రంలో 159, లక్ష్మంపురంలో 135, అంబాడ వెంకటాపురంలో 190 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు.

లక్కవరపుకోట: మండలంలోని వివిధ పాఠశాలలో చదువుతున్న 515 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 58 మంది, కొట్యాడ 74 , గంగుబూడి 52 , ఏపీ మోడల్ స్కూల్ 81 , కేజీబీవీ 47 , గొల్జాం 73 , లక్కవరపుకోట 66, శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుండి 29మందితో పాటు కొత్తవలస మండలానికి చెందిన జ్యోతిరావు పూలే బాలికల ఆశ్రమ పాఠశాల నుండి 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ మండలానికి చెందినప్పటికీ అక్కడ చదువుతున్న 38 మంది విద్యార్థులు వియ్యంపేటలో రాయనున్నారు. ఈ 515 మంది విద్యార్థులకు ఎల్ కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. పరీక్ష కేంద్రాల పర్యవేక్షణకు 53 మంది ఇన్విజిలేటర్లను డిఇఒ నియమించినట్లు స్థానిక ఎంఇఒలు సిహెచ్ కూర్మారావు, శ్రీనివాసరావులు వెల్లడించారు.

రేగిడి: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ గ్రామ పెద్ద లెంక శ్రీరాములు పరీక్షలు రాయడానికి అవసరమైన ప్లాంకు, పెన్నులు, పెన్సిల్లు, రబ్బరు, స్కేలు కలిపిన కిట్లను అందజేశారు. విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి రాము, పాఠశాల సోషల్ టీచర్ బి. అనంతరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం మోహన్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొబ్బిలి: కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాదించవచ్చునని ఎపిజె అబ్దుల్ కలాం అసోసియేషన్ గౌరవ అద్యక్షులు గేదెల చంద్రినాయుడు, అద్యక్షులు గొర్లె లక్ష్మణరావు అన్నారు. మండలంలోని ఎం.బూర్జవలసలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్లాంక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి, క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న శ్రీరాములు, రాము

21న జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని గుర్ల తమ్మిరాజుపేటలో ఈనెల 21వతేదిన ఎల్లమ్మ తల్లి జాతర జరుగుతున్న సందర్భంగా మండల స్థాయి పురుషుల వాలీబాల్, జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గుర్ల తమ్మి రాజుపేట అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు చొక్కాకు సన్యాసిరాయుడు, కొండమ్మ దంపతులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు సమన్వయకర్తగా డాక్టర్ పొట్నూరు శ్రీరాములు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన ఉదయం 9 గంటల నుండి మెంటాడ మండల స్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు ఉంటాయని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి రూ.6వేలు, 4వేలు, 2వేలు నగుదు బహుమతులు, షీల్డ్‌లు అందిస్తామని చెప్పారు. ఈ నెల 21వ తేదీన సాయంత్రం 3 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జిల్లా స్థాయి మహిళల కబడ్డీ పోటీలను నిర్వహించి విజేతలకు రూ.10వేలు, రూ.6వేలు, 4వేలు, 2వేలు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన దలచిన వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల పేర్లు నమోదు చేసుకోవాలని శ్రీరాములు తెలిపారు. వాలీబాల్ క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో హాజరుకావాలని, మెంటాడ మండలానికి చెందిన క్రీడాకారులు మాత్రమే ఈ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనుటకు అర్హులని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులకు భోజన సదుపాయం ఉంటుందన్నారు.

పోరాటానికి డాక్టర్లు మద్దతివ్వండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మిమ్స్ డాక్టర్లు మద్దతు ఇవ్వాలని ఉద్యోగులు, కార్మికులు కోరారు. ఈ పోరాటం ఆదివారం నాటికి 46 రోజులకు చేరుకున్న నేపథ్యంలో మిమ్స్‌లో పనిచేస్తున్న డాక్టర్లను కలిసి తమ పోరాటానికి మద్దతు తెలియజేయాలని, యాజమాన్యంతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికై మీ వంతు కృషి చేయాలని ఉద్యోగులు కార్మికులు కోరారు. ఈ సందర్భంగా మిమ్స్‌లో పనిచేస్తున్న డాక్టర్ మల్లేశ్వరరావు, డాక్టర్ శ్రీరామమూర్తి, డాక్టర్ లెంక శ్రీనివాస్, డాక్టర్ అశోక్, డాక్టర్ జె.సి నాయుడు, డాక్టర్ జి.వి శేషగిరిరావు, మరికొంత మంది డాక్టర్లను కలిసి పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టివి రమణ, ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు, కె. మధు సూధనరావు, ఎం రాంబాబు, కె కామునాయుడు, అప్పలనాయుడు, ఎం ఆదినారాయణ, గౌరి, ఆదిలక్ష్మి, బంగారు నాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డాక్టర్ అశోక్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఉద్యోగులు, నాయకులు

గురుదేవ్ ఆస్పత్రికి విరాళం

ప్రజాశక్తి - కొత్తవలస

గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ విజయశ్రీ జ్ఞాపకర్థం ఉప్పలపాటి ఫౌండేషన్ సౌజన్యంతో వి.రాజు 100 పడకల కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం డాక్టర్ విజయశ్రీ విగ్రహ ఆవిష్కరణ చేశారు. కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి రూ.2.50కోట్లు చెక్కును విరాళంగా అందించారు. గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ అండ్ హాస్పిటల్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో 20 మంది వికలాంగులకు ఉచిత కృత్రిమ కాళ్లు, చేతులు, బ్లైండ్ స్టిక్స్, చెవిటి మిషన్‌లు, పోలియో కాలిపర్స్, 75 మందికి పైగా అందులకు బ్లైండ్ స్టిక్స్, పెన్షన్స్, ముసలి వాళ్ళకి రేషన్ పంపిణి చేశారు. 50 మంది చిన్న పిల్లలకు జాన్సన్ బేబీ కిట్స్, ఫీడింగ్ బాటిల్స్ అందించారు. గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ అండ్ హాస్పిటల్ సభ్యులు పాల్గొన్నారు.

పరికరాలను పంపిణీ చేస్తున్న రాజు, జగదీష్

మరో అవకాశమివ్వండి

ప్రజాశక్తి- గజపతినగరం

నియోజవర్గం నుంచి మరో పర్యాయం గెలిచే అవకాశాన్ని ప్రజలు కల్పించాలని తద్వారా మరింత అభివృద్ధి చేసి చూపుతానని స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు మరొక పర్యాయం టికెట్ ఇచ్చిన ముఖ్యమంత్రి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తన ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో సుమారు రూ.750 కోట్లలతో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టామన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధి కార్యక్రమాలు తాను చేసి చూపానన్నారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలంటే మరో అవకాశం ఇవ్వాలని చెప్పారు. అవినీతికి తావు లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందజేశామన్నారు. గతంలో కన్నా అత్యధిక మెజార్టీతో గెలుస్తాననే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్‌పిటిసి గార తౌడు, సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, ఎస్.పైడిరాజు, కె.ఆదినారాయణ, పిఎస్ఎన్ మూర్తి, కనకల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

శేషగిరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శేషగిరికి ఘన నివాళి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఉపాధ్యాయ ఉద్యమ నేత దివంగత కె.శేషగిరి జయంతి తాండ్రపాపరాయ మున్సిపల్ పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ప్రసన్నకుమార్, పి.సత్యనారాయణ, ఏ.శ్రీనివాస్, ఇతర నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు తాగునీటి సదుపాయం తక్షణమే కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని పెదశాఖ పంచాయతీ జల గ్రామం వద్ద ఆదివారం విలేకరులతో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు ఎం.ప్రసాదు మాట్లాడారు. జల గ్రామంలో 45 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నారని, వీరికి మంచినీరందక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమీప గెడ్డ నుంచి కలుషిత నీరు తెచ్చుకోవడంతో మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలతో బాధపడే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని గతంలో సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆర్డబ్ల్యుఎస్ అధికారులకు తెలియజేయడం జరిగిందని దీనికి స్పందించి ఆర్డబ్ల్యుఎస్ అధికారులు జల, గుజ్జబడిలో గడిచిన 30 రోజుల క్రితం మంచినీటి బోరు తీశారన్నారు. అయితే ఈ బోరుకు హెడ్ బిగించకపోవడం చూస్తుంటే ఎందుకు తీశారో తెలియని పరిస్థితిలో ఉందని అన్నారు. ఇలాంటి సందర్భంలో గెడ్డలోనే కలుషితమైన నీరు తెచ్చుకునే పరిస్థితి ఉందని, కావున వెంటనే రెండు గ్రామాల్లో మంచినీరు బోరుకు హెడ్ బిగించి మంచినీరు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఐదు వారాలుగా ఉపాధి పనులు చేసినప్పుడు కూడా పైసా వేతనం రాకపోవడంతో గడిచిన రెండు వారాలుగా పనికి వెళ్లకుండా ఇంటి దగ్గర ఇబ్బందులు పడుతూ ఉండే పరిస్థితి ఉందన్నారు. జల గ్రామానికి ఒక కాలువ గానీ పరిశుభ్రత గానీ ఏమీ లేని పరిస్థితి ఉందని, కావున వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని బోరుకు హెడ్ బిగించి మంచినీరివ్వాలని కోరారు. అలాగే ఐదు వారాలుగా పెండింగ్ ఉన్న ఉపాధి వేతనాలు చెల్లించాలని, అలాగే గ్రామంలో కాలువలు నిర్మించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జగ్గారావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కల్వర్టు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ పరిధిలోగల గిరిజన గ్రామమైన సారవానిపాలెం వద్ద కల్వర్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ గిరిజనులు ఏమాత్రం వర్షం వచ్చినా మారిక కొండ నుంచి వచ్చే వర్షపు నీరు విజయ రామ సాగర్‌లోకి వెళ్లే నీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల ఆ వాగు దాటుకుని వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా పిల్లలు బడికి వెళ్లేందుకు నానా తంటాలు పడేవారు. మారిక వెళ్లే అవకాశాలు లేకపోవడంతో పలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం పలుమార్లు ఎంపిపి, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్తు చైర్మన్ దృష్టికి ప్రజాశక్తి కథనాలు ద్వారా తీసుకెళ్లడంతో స్పందించిన యంత్రాంగం ఎట్టకేలకు పనులను ప్రారంభించి చురుగ్గా చేపడుతుంది. ఉపాధి నిధులు రూ.35లక్షలతో కల్వర్టు పనులు చేపడుతున్నారు. ఎంపిటిసి ముత్యాలమ్మ కూడా పలుమార్లు ఈ కల్వర్టుపై నిర్మాణం చేయాలని పోరాటం చేశారు. ఎట్టకేలకు నిధులు మంజూరు కావడంతో ఆమెకు గిరిజనులు అభినందనలు తెలుపుతున్నారు.

కల్వర్టు నిర్మాణం చేస్తున్న కూలీలు

గిరిజన సమస్యలు పట్టని అధికార, ప్రతిపక్షాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల సమస్యలు పట్టని వైసిపి, టిడిపి, బిజెపి, జనసేనలు ఎన్నికల్లో కార్పొరేట్లు ఇచ్చిన ఎలక్టోరల్ బాండ్ల డబ్బులు పంచి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. డబ్బులు పంచకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలవడానికి పై పార్టీలు సిద్ధమా అని ప్రశ్నించారు. వీటికి భిన్నంగా సిపిఎం ప్రజా పోరాటాలు చేపట్టి ప్రజల వద్ద నిధులు సేకరించి ఎన్నికల్లో పోటీ చేస్తూ ప్రజాసేవకు, పోరాటాలకు సిద్ధమవుతున్న సిపిఎంను గెలిపించాలని కోరారు. విశ్వసనీయత, పారదర్శకత, నీతి నిజాయితీ గురించి పదే పదే ప్రస్తావించే జగన్మోహన్ రెడ్డి బాండ్ల ద్వారా అందిన నిధుల విషయాన్ని ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్ల విధానం రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం వాక్ స్వాతంత్ర్యాన్ని, సమాచార హక్కును ఉల్లంఘిస్తోందని సుప్రీం ధర్మాసనం స్పష్టంగా తన తీర్పులో వెల్లడించిందని తెలిపారు. ఈ బాండ్లు వ్యవహారం అతి పెద్ద స్కామ్ అన్నారు. మొత్తం బాండ్లలో సగం రూ.6,565 కోట్లు బిజెపికే అందాయన్నారు. అలాగే వైసిపికి రూ.337 కోట్లు, టిడిపికి రూ.218.88 కోట్లు, జనసేనకు రూ.21 కోట్లు కార్పొరేట్ సంస్థల ద్వారా అందాయని ఎన్నికల కమిషన్ ప్రకటించిన జాబితాలో ఉన్నాయని తెలిపారు. దీనికి ఆ పార్టీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అవినీతి, స్కాములు, బడ్జెట్ పాలిటిక్స్ గురించి మాట్లాడే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఎలక్టోరల్ బాండ్లపై చర్చ జరుగుతుంటే వైసిపి, టిడిపి, జనసేన తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ పార్టీల రంగుల జెండా వేరైనా ఎజెండా మాత్రం ఒక్కటేనని దుయ్యబట్టారు. రాజకీయాలను డబ్బులు ఏ స్థాయిలో ప్రభావితం చేస్తాయో ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల రద్దు చేయాలని మొదట్నుంచి సిపిఎం పోరాడుతుందన్నారు. సుప్రీంలో కేసు వేసి చివరివరకు పోరాడిందన్నారు. ఈ బాండ్లు తీసుకోని పార్టీలు వామపక్షాలు, సిపిఎం(ఐ) మాత్రమేనని అన్నారు. ప్రజాస్వామ్యానికి సమాచారం చాలా అవసరమని, ఎలక్టోరల్ బాండ్లు చట్టబద్ధ క్విడ్ ప్రోకో అని విమర్శించారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు ఎలక్టోరల్ బాండ్లు ద్వారా ఏ పెట్టుబడిదారుడు, ఏ కంపెనీ ఎంత మొత్తం ఇచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఘటాన్ని ఊరేగిస్తున్న బేబినాయన

ఘనంగా సిర్లిపోతన్న, ఎల్లారమ్మ జాతర

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక గొల్లవీధిలో సిర్లిపోతన్న, అప్పయ్యపేటలో ఎల్లారమ్మతల్లి జాతర ఘనంగా జరిగింది. సిర్లిపోతన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేసేందుకు యాత్రికులు క్యూ కట్టారు. అప్పయ్యపేట ఎల్లారమ్మతల్లి జాతరలో అమ్మవారి ఘటాలను టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన పట్టుకుని ఊరేగించారు.

చెద పట్టిన గదే గతి

- ఇబ్బందులు పడుతున్న విఆర్‌ఒలు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో విఆర్‌ఒలకు కేటాయించిన గది పూర్తిగి చెద పట్టింది. గదికి ఉన్న కిటికీలకు చెద పట్టడంతో శిధిలావస్థకు చేరాయి. ఏమాత్రం వర్షం వచ్చినా విధులు నిర్వహించడం సాధ్యం కావడం లేదని, ప్రస్తుతం ఎండాకాలం కావడంతో విపరీతైన వేడి గాలులు లోపలికి వచ్చి ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. గదులు బాగోకపోవడంతో కార్యాలయానికి వచ్చిన రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి విఆర్‌ఒలు విధులు నిర్వహిస్తున్న గది కిటికీలు ఏర్పాటు చేసి ఎండ నుంచి వచ్చే వేడి గాలితో పాటు వర్షపు నీరు లోనికి రాకుండా రికార్డులు పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.